సాక్షి
నంద్యాల
ఆదివారం | 5 | జనవరి | 2025





## శ్రీశైల దేవస్థానానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి శనివారం కర్నూలుకు చెందిన శెట్టి శ్వేత రూ.1,01,116 విరాళం అందజేశారు.



## అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో హైదరాబాద్ భరతకళ క్షేత్రం కళాకారులు శైవ గీతాలకు సంప్రదాయ నృత్యం చేసి అలరించారు.



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం (అడుగులు) | : 1,633 |
| ప్రస్తుతం | : 1,625.37 |
| సామర్థ్యం (టీఎంసీలు) | : 105.788 |
| ప్రస్తుతం | : 77.704 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | : 25 |
| అవుట్ ఫ్లో | : 8,935 |

## న్యూస్‌రీల్

### మల్లన్న స్పర్శదర్శనంలో మార్పులు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లన్న స్పర్శ దర్శనంలో మార్పులు చేసినట్లు శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాస రావు తెలిపారు. శనివారం ఈఓ మాట్లాడుతూ క్షేత్రాన్ని దర్శించే భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతున్న కారణంగా సర్వదర్శన క్యూలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇచ్చేందుకు మార్పులు చేశామన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రతి శని, ఆది, సోమవారాలు, ప్రభుత్వ సెలవురోజుల్లో రెండు పర్యాయాలు (7.30ని.లకు, రాత్రి 9.00 గంటలకు) మాత్రమే స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తామన్నారు. ఇతర సమయమంతా స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తామని చెప్పారు. భక్తులు స్పర్శదర్శనం టికెట్లను ఆన్‌లైన్ల ద్వారా పొందవలసి ఉంటుందని, ఒక్కో విడతలో 500 టికెట్లు మాత్రమే జారీ చేయబడుతాయన్నారు.

### డ్యాంలో 109 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో శనివారం సాయంత్రం సమయానికి 109.2730 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 861.10 అడుగులకు చేరుకుంది. శుక్రవారం నుంచి శనివారం వరకు భూగర్భజల విద్యుత్ కేంద్రంలో 3,985 క్యూసెక్కుల నీటిని వినియోగించుకొని 2.025 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులైన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీకి 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 490 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,375 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,334 క్యూసెక్కులు, నాగార్జునసాగర్‌కు 3,985 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

### సర్వేలు పూర్తి చేయాలి




మహానంది సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న సీఈఓ నాసరరెడ్డి

మహానంది: ప్రభుత్వం అమలు చేస్తున్న సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి ఆదేశించారు. మహానందిలోని సచివాలయంలో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అనంతరం మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురం లోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ, హౌస్ హోల్డ్ జియో క్యాప్చర్, ఎన్‌పీసీఐ సర్వే, పీఏసీఎస్‌ల సర్వేల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఈఓఆర్డీ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# పెళ్లెప్పుడవుతుంది.. బాబూ!

- కుదరని పెళ్లి సంబంధాలు
- అమ్మాయి తరఫు వారి కోర్కెలు కొండంతలు
- ఆస్తులు, అంతస్తులు ఉంటే ఓకే!
- లేకపోతే పెదవి విరుస్తున్న వైనం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగికే తొలి ప్రాధాన్యం
- పెరిగిపోతున్న వివాహ వయస్సు

సండే స్పెషల్



➤ కర్నూలు నగరానికి చెందిన ఓ యువకుడు ఫార్మసీ చదివాడు. అతనికి మెడికల్‌షాపు, సొంత ఇల్లు, కొంత డబ్బు ఉంది. కానీ ఈ అబ్బాయికి పిల్లను ఇవ్వడానికి రోడ్డుపై వ్యాపారం చేసుకునే వ్యక్తి సవాలక్ష అంక్షలు పెట్టాడు.

➤ కర్నూలు పాతనగరంలోని మెడికల్ ఏజెన్సీలో పనిచేసే యువకునికి ఉల్చాలరోడ్డులో సొంత ఇల్లు, కిరాణషాపు ఉన్నాయి. అతనికి ప్రస్తుతం 30 ఏళ్లు దాటాయి. అతనికి పిల్లను ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదు.

➤ కర్నూలులోని అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లోని బిజీ సెంటర్‌లో ఫుట్‌పాత్‌లో ఓ యువకుడు వ్యాపారం చేస్తుంటాడు. నెలకు రూ.50వేలకు పైగా ఆదాయం వస్తుంది. సొంత ఇల్లు, కొంత ఆస్తి ఉంది. ఆ అబ్బాయికి 30 ఏళ్లు దాటినా ఇంకా వివాహం కాలేదు.

.. ఇలా ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొంత మంది యువకులు పెళ్లి కోసం ఎదురు చూస్తున్నారు. కుటుంబ సభ్యుల గొంతెమ్మ కోర్కెలతో యువతీ యువకులకు వివాహ వయస్సు మీరిపోతోంది.

కర్నూలు(హాస్పిటల్): కుటుంబాల్లో వరసైన వారుంటే చూసి ఆరు దశాబ్దాల క్రితం పెళ్లిళ్లు చేసేవారు. బంధువుల్లో ఎవ్వరైనా వరుసైన వారుంటే పెద్దలు కూర్చుని మాట్లాడి పెద్దగా కట్న కానుకలు లేకుండానే ముప్పై ఏళ్ల క్రితం వివాహాలు జరిపేవారు. ప్రస్తుతం పెళ్లి సంబంధం కుదరడం పెద్ద సమస్యగా మారింది. పెళ్లి చేయాలంటే అబ్బాయికి ఎంత డబ్బు ఉంది, ఎన్ని ఆస్తులు ఉన్నాయి, సొంత ఇల్లు ఉందా అని అడుగుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయి ఉండాలని, పెళ్లయిన తర్వాత భార్యాభర్తలిద్దరు మాత్రమే ఇంట్లో ఉండాలనే గొంతెమ్మ కోర్కెలు అమ్మాయి తరఫు వారి నుంచి వస్తున్నాయి. జాతకాలు, పట్టింపులతో పెళ్లిళ్లు వాయిదా పడుతూ యువతీ, యువకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అప్పట్లో ఇలా..**

అబ్బాయికి 21, అమ్మాయికి 18 వచ్చీ రాగానే ముప్పై ఏళ్ల క్రితం పెళ్లి చేసేవారు. ఇప్పుడు అబ్బాయికి 35, అమ్మాయికి 30 దాటినా వివాహం కావడం లేదు. ఆలస్యంగా వివాహం కావడం వల్ల వారికి సంతాన భాగ్యమూ దక్కడం లేదు. కొందరికి ఆలస్యంగా పిల్లలు కలుగుతున్నా మరికొందరికి పిల్లలు లేకుండానే జీవితాన్ని కొనసాగించాల్సి వస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి సంవత్సరం 40 వేలకు పైగా వివాహాలు జరుగుతున్నాయి. వివాహ ముహూర్తాల సమయంలో అన్ని వర్గాల వ్యాపారులు, కార్మికులు ఎంతో బిజీగా ఉండేవారు. ఒకవైపు పెళ్లి తంతు జరుగుతుండగా మరోవైపు ఇంకో జంటను కలిపేందుకు బంధువులు, స్నేహితులు ఆరా తీస్తూ ఉండేవారు.

**కోర్కెలు ఎన్నెన్నో..**

ఒకప్పుడు పెళ్లి చూపుల్లో మగపెళ్లి వారు అమ్మాయిని రకరకాల ప్రశ్నలు వేసి వారి సహనాన్ని పరీక్షించేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. పెళ్లి చూపులకు ముందే అబ్బాయి వివరాలపై ఆరా తీస్తున్నారు. దీంతో పాటు పెళ్లయిన తర్వాత అమ్మాయి, అబ్బాయి వేరు కాపురం పెట్టాల్సి వస్తోంది. ఒకప్పుడు అమ్మాయిలు పెద్దగా చదివేవారు కాదు. అప్పట్లో ఇవన్నీ పట్టింపులు ఉండేవి కావు. కానీ ఇప్పుడు అమ్మాయిలు సైతం అబ్బాయిలతో సమానంగా చదువుతున్నారు. పెళ్లి సంబంధాల్లో అమ్మాయి తరపు వారి మాటే ఇప్పుడు నెగ్గుతోంది. ముఖ్యంగా చదువుకున్న వారు, పట్టణాల్లో ఉండే వారి కుటుంబాల్లో వివాహాలు ఆలస్యంగా జరుగుతున్నాయి.

**వయస్సు మీద పడుతున్నా...**

ఇప్పట్లో అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ చదువుకుంటున్నారు. వారి చదువులు పూర్తయ్యేలోగా పాతికేళ్లు వస్తున్నాయి. వైద్య విద్య అయితే 30 ఏళ్లు దాటుతోంది. చదువు పూర్తయ్యాకే సంబంధాలు చూడాలని అమ్మాయిలు తెగేసి చెబుతున్నారు. దీంతో తల్లిదండ్రులు వారి మాటను మన్నించి చదువు పూర్తయ్యేవరకు పెళ్లి మాట ఎత్తడం లేదు. చదువు పూర్తయ్యాక జాతకాలు, పట్టింపులు, డిమాండ్ల కారణంగా త్వరగా వివాహాలు కావడం లేదు. దీంతో యువతీయువకుల వివాహ వయస్సు గణనీయంగా పెరిగిపోతోంది. అబ్బాయికి 35, అమ్మాయికి 30 దాటినా వివాహాలు కాని వారు చాలా మందే ఉన్నారు.

**అమ్మాయిల సంఖ్య తగ్గింది**

ఒకప్పుడు స్త్రీ,పురుషుల గణనీయ సగటు సమానంగా ఉండేది. కానీ ఇప్పుడు వెయ్యి మంది పురుషులకు 900లోపే స్త్రీలు ఉంటున్నారు. ఈ కారణంగా వివాహం కోసం అమ్మాయిల కోసం వెతకాల్సి వస్తోంది. సరైన అమ్మాయి దొరక్క కొంత మంది యువకులకు పెళ్లి కూడా కాని పరిస్థితి నెలకొంది. అమ్మాయిల సంఖ్య తగ్గడానికి లింగవివక్షే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పట్టణాల్లో పట్టింపులేదు గానీ ఇప్పటికీ ఆదోని డివిజన్‌లోని అనేక గ్రామాల్లో అబ్బాయి మాత్రమే కావాలని పట్టుబడుతున్నారు. కడుపులో ఉన్నది అమ్మాయి అని స్కానింగ్‌లో తెలిస్తే వెంటనే అబార్షన్ చేయిస్తున్నారు. ఈ మేరకు స్కానింగ్, అబార్షన్ చేసే వైద్యులు జిల్లాలో అధిక శాతం ఉన్నారు.

**మరీ కష్టం..**

సమాజంలో కొన్ని వృత్తులు, కులాల్లోని వారికి వివాహం కావడం మరీ కష్టంగా మారింది. వృత్తి రీత్యా వారికి ఆదాయం తక్కువగా ఉంటుందని, ఆస్తిపాస్తులు ఉండవని, కొందరు కఠినంగా ఉంటారని భావించి అమ్మాయిని ఇచ్చి వివాహం చేసేందుకు చాలా మంది జంకుతున్నారు. మరికొన్ని ఉన్నత కులాల్లో అయితే అబ్బాయి, అమ్మాయి వయస్సు 35 దాటినా పెళ్లి కావడం లేదు. జాతకాలు, పట్టింపుల కారణంగా వారికి త్వరగా వివాహం కావడం లేదని మ్యారేజ్ బ్యూరోలు చెబుతున్నారు.

**“ అమ్మాయి తరఫు వారే చెడగొడుతున్నారు**



నేను పాతికేళ్ల నుంచి సంబంధాలు చూస్తున్నా. మొదట్లో అమ్మాయి ఫొటో చూసి, ఆ తర్వాత వివరాలు కనుక్కుని వెంటనే మాట్లాడుకుని పెళ్లి చేసుకునేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగా మారింది. ఎన్ని సంబంధాలు చూపినా అమ్మాయి వారికి నచ్చడం లేదు. అమ్మాయిలు చదువుకున్న వారైనందున డిమాండ్స్ పెరిగాయి. ఒక విధంగా వివాహాలు ఆలస్యం కావడానికి అమ్మాయి తరఫు వారే కారణం.
–డి.చిన్నయ్య, మ్యారేజ్ బ్యూరో, కర్నూలు

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే కావాలంటున్నారు**



నేను 15 సంవత్సరాలుగా మ్యారేజ్ బ్యూరోగా పనిచేస్తున్నా. ఉన్నత వర్గాల నుంచి పేదల వరకు అందరూ అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అయి ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో పాటు పెళ్లి అయిన తర్వాత అమ్మాయి, అబ్బాయి వేరు కాపురం ఉంటారని, అత్తామామలు వారితో ఉండకూడదని కోరుకుంటున్నారు. ఆస్తిపాస్తులు లేవని చాలా సంబంధాలు వెనక్కి పోతున్నాయి.
–లక్ష్మీనరేష్, మ్యారేజ్‌బ్యూరో, కర్నూలు

**పట్టింపులు వీడాలి**



పెళ్లిళ్లు కావాలంటే అమ్మాయి, అబ్బాయి తరపు వారు పట్టింపులు వీడాలి. చదువు, హోదా ఉన్నా ఆస్తి పాస్తులు భారీగా ఉండాలని, ఇంట్లో అత్తామామలు, తోడికోడళ్లు, ఆడబిడ్డలు కూడా ఉండకూడదని చెబుతున్నారు. కుటుంబమన్నాక ఇంట్లో తల్లిదండ్రులు, యువజంటలు, వారి పిల్లలు ఉండాలి. అప్పుడే అనుబంధాలు, ఆప్యాయతలు అందరికీ అర్థం అవుతాయి. ఇవేమీ లేకుండా విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదు.
–బి. శివప్రసాద్, కోడుమూరు

## దోచుకోవడమే లక్ష్యంగా పాలన

- కూటమి సర్కారుపై ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ధ్వజం



బొమ్మలసత్రం: కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను దోచుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా విమర్శించారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ హామీలతో గద్దెనెక్కిన బాబు అధికారంలోకి వచ్చాక వాటిని అటకెక్కించారన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు లేదా ఒక్కొక్కరికి రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని నమ్మించారన్నారు. ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. అలాగే తల్లికి వందన, ఆడబిడ్డ నిధి, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఇలా అనేక పథకాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చంద్రబాబు తెలుగు తమ్ముళ్లకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. విచ్చలవిడిగా మద్యం దుకాణాల ఏర్పాటే అందుకు నిదర్శనమన్నారు. ఎప్పుడూ మాట మీద నిలబడరనే పేరును బాబు మరోసారి సార్థకం చేసుకున్నారని విమర్శించారు. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో గెలిచిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాయని గుర్తు చేశారు. ఇక్కడ కూటమి సర్కారు మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాలు అమలు చేసిందన్నారు. వివిధ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చిందని చెప్పారు. ప్రస్తుత సర్కారు ఆదుకోకపోగా కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన వలంటీర్లను తొలగించి వారి కడుపు కొట్టిందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య కూడా దూరమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

## మద్దిలేటయ్య ఆదాయం రూ. 1,98,185

బేతంచెర్ల: పుష్యమాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన లక్ష్మీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. వీరి వివిధ సేవల ద్వారా ఒక్కరోజే ఆలయానికి రూ.1,98,185 ఆదాయం వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు.

## 7 నుంచి విద్యుత్ చార్జీల పెంపుపై అభిప్రాయ సేకరణ

నంద్యాల(అర్బన్): విద్యుత్ చార్జీల పెంపుపై ఈనెల 7, 8 తేదీల్లో వినియోగదారుల అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ నంద్యాల డివిజన్ ఈఈ శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఈ కార్యాలయం పవర్‌హౌస్ కాంపౌండ్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యత

- లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్



బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో లూయిస్ బ్రెయిలీ 217వ జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. తొలుత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. ఇందుకు లూయిస్ బ్రెయిలీనే ఆదర్శమన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కింద సబ్సిడీ రుణాలు, ముద్ర లోన్లు, విశ్వకర్మ యోజన పథకం కింద జీవనోపాధి యూనిట్లు మంజూరు చేస్తామన్నారు. కొందరు బోగస్ పెన్షన్ తీసుకుంటున్నట్లు సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రీ వెరిఫికేషన్ నిర్వహించి అనర్హులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. శారీరక వైకల్యం 40 శాతం పైబడి ఉన్న విభిన్న ప్రతిభావంతులకు మెడికల్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. అర్హత కలిగిన వారికి అంత్యోదయ, అన్న యోజన కార్డుల మంజూరుపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 11వేల టిడ్కో గృహాలు ఉన్నాయని విభిన్న ప్రతిభావంతులకు వాటిలో ఫ్లాట్లు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా, డీఈఓ జనార్దన్ రెడ్డి, జాతీయ అంధుల సంస్థ అధ్యక్షులు అనిల్, సుబ్రహ్మణ్యం, పుష్పరాజు, జనరల్ సెక్రెటరీ మహేశ్వరరెడ్డి, విజువల్లి చాలెంజ్డ్ ఎంప్లాయ్ అధ్యక్షుడు ఓబులేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాట వినకపోతే అంతే!

- ఆళ్లగడ్డలో ఆటవిక రాజ్యం
- రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- ఏ అధికారైనా జీ హుజూర్ అనాల్సిందే
- చెప్పినట్లు వినలేదని మునిసిపల్ కమిషనర్‌ను సెలవుపై పంపించిన వైనం
- సస్పెండైన హౌసింగ్ ఏఈ
- వేధింపులు తట్టుకోలేక సెలవుపై వెళ్లేందుకు సిద్ధమైన దొర్నిపాడు ఈఓపీఆర్డీ
- తాజాగా రూరల్ సీఐపై చర్యలు తీసుకోవాలని పోలీస్ కార్యాలయంపై దండెత్తిన పచ్చమూకలు
- పోలీసులకే రక్షణ లేకుంటే మా పరిస్థితేంటని బెంబేలెత్తుతున్న ఇతర అధికారులు

అక్కడ అధికారులెవరైనా నిబంధనలు పక్కన పెట్టాలి. అధికారపార్టీ నాయకులు చెప్పినట్లు వినాలి. వారి అడుగులకు మడుగులొత్తాలి. రాజకీయ ప్రత్యర్థులకు పనులు చేయకూడదు. గిట్టనోళ్లపై కేసులు పెట్టి వేధించాలి. అవసరమైతే గ్రామ బహిష్కరణ చేయాలి. అంతేకాదు అధికార పార్టీ వారు అనుమతులు లేకుండా మట్టి తవ్వినా.. కొండలు కరిగించి సొమ్ము చేసుకున్నా కిమ్మనకూడదు. అడిగిన చోట సంతకాలు చేయాలి.. అసైన్డ్, పోరంబోకు భూములు కట్టబెట్టాలి. కాదంటే కుర్చీలో కూర్చోలేరు. వేధింపులు భరించలేరు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలో సాగుతున్న తంతు ఇదీ.



ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో అధికారులపై టీడీపీ నేతల ఒత్తిళ్లు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పెత్తనం చెలాయిస్తున్నారు. బదిలీల్లో భాగంగా పోస్టులకు రూ.లక్షలు ముట్టజెప్పి వచ్చిన అధికారులు తాము చెప్పినట్లు వినాల్సిందేనని నేతలు, ప్రజా ప్రతినిధులు పట్టుబడుతుండటంతో విధుల నిర్వహణకు అధికారులు హడలి పోతున్నారు. ఈ క్రమంలో ఎదురయ్యే ఒత్తిళ్లలను తట్టుకోలేక సతమతమవుతున్నారు. తాజాగా రూరల్ సీఐ కంబగిరిరాముడిపై చర్యలు తీసుకోవాలని రోడ్డెక్కారు. సదరు అధికారి చిన్నవంగలి పాలకేంద్రం ఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు వచ్చిన తమ ప్రత్యర్థులను అడ్డుకోలేదనే అక్కసుతో ఓ రౌడీషీటర్, మరి కొంత మంది టీడీపీ నేతలు ఏకంగా పోలీస్ కార్యాయం ఎదుటే ధర్నాకు దిగారు. పోలీసు జులుం నశించాలి, సీఐ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ ఘటన పట్ల మనసు నొచ్చుకున్న పోలీసు అధికారులు తాము ఎంత చేసినా చివరకు ఇలా చేయడం ఏంటని చర్చించుకున్నట్లు తెలుస్తోంది. పోలీస్ అధికారులకే ఈ పరిస్థితి ఎదురైతే తమ పరిస్థితి ఏంటని ఇతర అధికారులు ఆందోళన చెందుతున్నారు.



సీఐ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

**దీర్ఘకాలిక సెలవుపై కమిషనర్**

మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరామిరెడ్డికి కొంత కాలం క్రితం ఓ దుకాణ యజమాని చెప్పినట్లు వినడం లేదని అతని దుకాణాన్ని ఎలాగైనా మూసేయించాలని టీడీపీ నాయకుల హుకుం జారీ చేశారు. దీంతో ఆయన అతనికి నోటీసులు ఇచ్చా రు. అయితే దుకాణదారుడు కోర్టుకు పోయి అనుమతి తెచ్చుకున్నాడు. అయినా, టీడీపీ నేతల ఒత్తిడికి తలొగ్గి అనుమతి ఇవ్వలేదు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి పోవడంతో కమిషనర్‌ను మందలించగా విధిలేక అనుమతి ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆగ్రహించిన నేత ఇంటికి పిలిపించుకుని దుర్భాషలాడి వెంటనే సెలవు పెట్టి పోవాలని హుకుం జారీ చేయడంతో అప్పటికప్పుడు సెలవుపై వెళ్లి పో వడం జరిగింది.

**ఎవరో చేసిన పనికి సస్పెండైన ఏఈ**

హౌసింగ్ లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఇసుకను అధికార పార్టీ నేతలు రాత్రికి రాత్రి తరలించుకు పోయారు. ఈ విషయం తెలియ జేసినప్పటికీ ఎవరికీ తెలియదు ఏం కాదులే మేం చూసుకుంటామని అన్నారు. విషయం బయట పడటంతో మాకు సంబంధం లేదని హౌసింగ్ ఏఈ రమణారెడ్డి పై నెపం వేసి అతడిని సస్పెండ్ చేయించారు. ఇప్పుడు ఏకంగా సీఐ పైనే దురుసుగా ప్రవర్తిస్తుండటంతో అధికారుల్లో వణుకు మొదలైంది.

**చాగలమర్రిలో ఉద్యోగం చేయాలంటే హడల్**

చాగలమర్రి మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా బాధ్యతలు చేపట్టిన ప్రకాశం రెండు నెలలకే అధికారపార్టీ నాయకుల ఒత్తిడిని తట్టుకోలేక సెలవుపై వెళ్లాడు. ఆ సెలవుల్లోనే ఉన్నతాధికారులతో మాట్లాడుకుని బదిలీ చేయించుకుని వెళ్లిపోయాడు. చాగలమర్రి మండలానికి ఎంపీడీఓగా ఎన్నికల అనంతరం బదిలీపై వచ్చిన మంజులవాణి ఇక్కడ ఒక నెల బాధ్యతలు నిర్వహించింది. తర్వాత ఒత్తిడి, బెదిరింపులు ఎక్కువ కావడంతో నంద్యాల డీపీఓ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లింది. చాగలమర్రి మండలం హౌసింగ్ ఏఈ షఫీవుల్లా కూడా దొంగ బిల్లులు, అర్హత లేనివారికి ఇళ్లు మంజూరు చేయాలని రోజు బెదిరిస్తుండటంతో సెలవుపై వెళ్లి పోయాడు. కాగా వీరి స్థానంలో ఎవరూ ఇక్కడకు వచ్చేందుకు మొగ్గ చూపకపోవడంతో ఇన్‌చార్జ్‌లతో పాలన కొనసాగిస్తున్నారు. ఇలా నియోజకవర్గంలో పదుల సంఖలో అధికారులు బదిలీ చేయించుకుని వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారే తప్ప ఇక్కడికి వస్తామని అడిగే అధికారే లేడని ఉద్యోగుల్లో చర్చ కొనసాగుతోంది.

**చెయ్యని పనులకు బిల్లులు**

దొర్నిపాడు మండలంలో కొందరు పంచాయతీ సెక్రటరీలు అధికార పార్టీ నేతలకు రూ. 2 లక్షల దాక ఇచ్చి పోస్టింగ్‌లు తెచ్చుకున్నారు. తిరిగి ఆ సొమ్ము సంపాదించుకోవడంతో పాటు ప్రస్తుతం చేస్తున్న పనుల్లో అధికార పార్టీనాయకులకు పర్సెంటేజీ ఇవ్వాల్సి ఉంటుందని ఇష్టమొచ్చినట్లు బిల్లులు రాసుకున్నారు. తర్వాత వాటిపై సంతకం పట్టాలని ఈఓపీఆర్డీ సులోచన దగ్గరకు పోగా అందుకు ఆమె ఒప్పుకోలేదు. ఈ విషయం కొందరు 'అక్క' దృష్టికి తీసుకుపోగా ఈఓపీఆర్డీని ఆమె తీవ్రంగా మందలించి చెప్పినట్లు బిల్లులపై సంతకం పెట్టు ..లేకుంటే సెలవుపై వెళ్లు అని హెచ్చరించినట్లు సమాచారం. ఈ తప్పుడు బిల్లులు పెడితే తన ఉద్యోగానికే ఎసరు వస్తుందని భయపడిన సదరు అధికారిణి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు.

## డ్రాపౌట్ తగ్గించేందుకే మధ్యాహ్న భోజనం

- రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్



మధ్యాహ్న భోజనం చేస్తున్న మంత్రి, కలెక్టర్

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థుల డ్రాపౌట్ తగ్గించేందుకే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకొచ్చినట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాలలో ఈ పథకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. వాటన్నింటిలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు ప్రస్తుతం రూ.27.39 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అలాగే బోధనా విధానాన్ని మెరుగుపర్చేందుకు జిల్లా, రీజనల్ స్థాయిలో అకడమిక్ గైడెన్స్ అండ్ మానిటరింగ్ సెల్ (ఏజీఎంసీ)లను ఏర్పాటు చేశామన్నారు. క్రమం తప్పకుండా పేరెంట్ – టీచర్స్ సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేస్తున్నామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంసెట్/నీట్ పరీక్షల మెటీరియల్, ప్రాక్టికల్ రికార్డులు, పుస్తకాలు ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తామన్నారు. ఒకేషనల్ విద్య అభ్యసించే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో పాటు నైపుణ్యం పెంచుకోవాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు ప్రతిరోజు పౌష్టికాహారం అందజేస్తామని చెప్పారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కుల కోసం కాకుండా విషయ పరిజ్ఞానం పెంచుకోవడంపై దృష్టి సారించాలన్నారు. అప్పుడే పోటీ పరీక్షల్లో నెగ్గుకురాగలుగుతారని చెప్పారు. కాలాన్ని వృథా చేయకుండా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ జనార్దన్ రెడ్డి, డీఐఈఓ సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్, ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కరిముల్లా, ఉర్దూ కాలేజ్ ఇన్‌స్పెక్టర్ అసుముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

- **కోవెలకుంట్ల:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకుని తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు, అధ్యాపకులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### హిప్నోథెరపీతో మానసిక ఒత్తిడి దూరం



వైద్య విద్యార్థినికి హిప్నోథెరపీ చేస్తున్న డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): హిప్నోథెరపీ ద్వారా వైద్య విద్యార్థులు తమ మానసిక ఒత్తిడి దూరం చేసుకోవచ్చని హిప్నోథెరపిస్టు డాక్టర్ సిరిగిరెడ్డి జయారెడ్డి చెప్పారు. ప్రపంచ హిప్నోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో వైద్య విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, పర్సనల్ సమస్యల వల్ల చదువు, సమస్యల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను ఎమోషనల్ ఇంటెలిజెంట్ ద్వారా తొలగించుకోవచ్చన్నారు. తద్వారా ఆత్మహత్యలను సైతం నివారించవచ్చన్నారు. హిప్నోథెరపీతో విద్యార్థులకు ఏకాగ్రత కుదురుతుందని, తద్వారా వారు చదువులో బాగా రాణిస్తారన్నారు. మోటివేషన్ క్లాసులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, బయోకెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌తో పాటు హిప్నోథెరపీ కూడా విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు.

### పీఎం అజయ్ కింద వడ్డీ లేని రుణాలు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం అజయ్) పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని ఎస్సీ మహిళల జీవనోపాధులను అభివృద్ధి చేసేందుకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయనున్నారు. డీఆర్‌డీఏ అమలు చేస్తున్న ఉన్నతి ద్వారా రుణాలు పంపిణీ చేస్తారు. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ ఇస్తుంది. ఉన్నతి ద్వారా పీఎం అజయ్ కింద రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తారు. ఈ రుణాలకు వడ్డీ ఉండదు. రూ.లక్ష రుణం పొందితే 24 నెలలు, రూ.2 లక్షల వరకు రుణం తీసుకుంటే 36 నెలలు, రూ.3 లక్షల వరకు రుణం తీసుకుంటే 60 నెలల్లో చెల్లించాల్సి ఉంది. ఉన్నతి కింద తీసుకునే రుణాలను చెల్లించిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ విడుదల చేస్తుంది. రూ.50 వేలకు మించకుండా సబ్సిడీ ఇస్తారు. ఈ రుణ సదుపాయంతో మహిళలు కిరాణం, చీరల వ్యాపారం, ఆటో, టెంట్‌హౌస్, చెప్పుల అంగడి, కంప్యూటర్ ఇంటర్నెట్ సెంటర్లు, కోళ్ల పెంపకం వంటి వాటిల్లో రాణించవచ్చు. జిల్లాకు 81 యూనిట్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తి అయిందని డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

### రెండో సెమిస్టర్ పరీక్షలకు 299 మంది గైర్హాజర్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షలకు 299 మంది ఛాత్రోపాధ్యాయులు గైర్హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 3,902 మందికి 3,602 మంది హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

### రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# బెటాలియన్‌లో అంతా గుట్టుగా..

- సిబ్బందితోనే నిర్మాణ పనులు
- స్లాబ్ కూలి ఏపీఎస్పీ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- రోడ్డు ప్రమాదంలో జరిగినట్లు ఒప్పుకోవాలని అధికారుల ఒత్తిడి
- రహస్యంగా ఆసుపత్రిలో బాధితుడికి చికిత్స



ఏపీఎస్పీ పటాలం ప్రధాన ద్వారం

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ బెటాలియన్‌లో వివిధ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం కూలీల చేత ఈ పనులు చేయించాలి. అయితే బెటాలియన్ హెడ్ క్వాటర్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది చేత భవన నిర్మాణ పనులు చేయించి నిధులు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రైనేజీ గుంత నిర్మాణానికి సంబంధించి ఇటీవల రూ.8 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో కూలీల ద్వారా పనులు చేయించాల్సి ఉంది. అయితే బెటాలియన్ హెడ్ క్వాటర్‌లో పనిచేసే సిబ్బంది చేతనే నిర్మాణ పనులు చేయిస్తున్నారు. దాదాపు 220 మంది సిబ్బంది హెడ్ క్వాటర్‌లో విధులు నిర్వహిస్తుండగా, కొంతమందిని మాత్రం క్యాంపస్ సెక్యూరిటీ కోసం వినియోగిస్తున్నారు. మిగిలిన వారి చేత ప్రతిరోజూ ఉదయం 6:30 నుంచి 8:30 గంటల వరకు, 9 నుంచి 11 గంటల వరకు కూలీ (నిర్మాణ) పనులు చేయిస్తున్నారు. చెట్లకు నీళ్లు పోయడం, పిచ్చిమొక్కలు తొలగింపుతో పాటు మురుగు కాలువలు, పాత భవనాల మరమ్మతులు, నూతన బిల్డింగుల నిర్మాణం వంటి పనులు కానిస్టేబుళ్లతోనే చేయిస్తున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా డ్రైనేజీ గుంత నిర్మాణ పనులకు పది మంది సిబ్బందిని వినియోగిస్తుండగా ఈనెల 2వ తేదీ అకస్మాత్తుగా డ్రైనేజీ గుంత స్లాబ్ కూలి కానిస్టేబుళ్లు నాగేంద్ర, నరసింహులు తీవ్ర గాయాలకు గురయ్యారు. నాగేంద్ర (పీసీ నెం.1365) కాలికి నాలుగు వేళ్లు తెగిపోయాయి. మిగిలిన వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే ఈ విషయం బయటకు పొక్కకుండా ఉన్నతాధికారులు రహస్యంగా నాగేంద్రకు కొత్తబస్టాండ్ సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు.

**బెటాలియన్ అధికారులకు డీజీ చీవాట్లు....**

ఈ విషయం ఆ శాఖ ఉన్నతాధికారి (డీజీ) రాజకుమారి దృష్టికి వెళ్లింది. దీంతో ఆమె బెటాలియన్ అధికారులను తీవ్రంగా మందలించినట్లు సమాచారం. కూలీల చేత చేయించాల్సిన నిర్మాణ పనులను సిబ్బంది చేత ఎందుకు చేయించారని మందలించినట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది. అయితే రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురైనట్లు ఒప్పుకోవాలని ఉన్నతాధికారులు నాగేంద్రపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అవసరమైతే మెడికల్ లీవ్‌లో వెళ్లాలని తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నప్పటికీ కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదు. సర్జరీ చేయడానికి దాదాపు రూ.4 లక్షలు ఖర్చు అవుతున్నట్లు వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు అయోమయానికి గురవుతున్నారు. ప్రమాదం జరిగి నాలుగు రోజులైనప్పటికీ డీజీపీ ఆఫీసుకు కూడా సమాచారం లేకుండా బెటాలియన్ సిబ్బంది రహస్యంగా బాధితుడికి చికిత్స చేయిస్తున్నారు.

**ఆర్డర్లీ వ్యవస్థ రద్దయినప్పటికీ...**

పోలీసు శాఖలో ఆర్డర్లీ వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఇళ్లల్లో సిబ్బంది చేత పనులు చేయిస్తుండగా కొన్నేళ్ల క్రితమే ఈ వ్యవస్థను ఆ శాఖ ఉన్నతాధికారులు రద్దు చేశారు. అయినప్పటికీ కర్నూలు ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఇప్పటికీ ఆర్డర్లీ వ్యవస్థ కొనసాగుతోంది. దాదాపు 25 మంది ఉన్నతాధికారులు తమ ఇళ్ల వద్ద సిబ్బంది చేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నట్లు సిబ్బందిలో చర్చ జరుగుతోంది. ఆర్ఐ ర్యాంకు నుంచి కమాండెంట్ స్థాయి అధికారి వరకు ఇళ్ల వద్ద సిబ్బంది చేత పనులు చేయించుకుంటున్నట్లు సిబ్బంది ఆరోపిస్తున్నారు. స్లాబ్ కూలిన ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన నాగేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా కుటుంబ సభ్యులు సెల్ ఫోన్‌లో ఫొటో తీయగా ఉన్నతాధికారులు తెలుసుకుని వారి సెల్‌ఫోన్‌ను లాక్కుని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

### పంచాయతీ వింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రకాంత్



చంద్రకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

కర్నూలు (అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టర్ పంచాయతీ విభాగం ఏవో, మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా వి.చంద్రకాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ ఉద్యోగుల జిల్లా స్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షులుగా ఇప్పటివరకు కొనసాగిన జీఎస్ఏ ప్రసాద్ రాష్ట్ర కార్యవర్గానికి ఎంపిక కావడం పట్ల అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలోనే జిల్లా అధ్యక్షులుగా చంద్రకాంత్ రెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పంచాయతీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు అసోసియేషన్ ఎళ్లవేళలా అండగా ఉంటుందన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం పరిపాలన అధికారి ప్రతిమ, ఉమ్మడి జిల్లాకు చెందిన నాయకులు శ్రీనివాసరెడ్డి, శివ, మారుతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న కానిస్టేబుళ్ల ఎంపిక

- తుది రాత పరీక్షకు 173 మంది మహిళా అభ్యర్థులు ఎంపిక



లాంగ్‌జంప్‌లో పోటీ పడుతున్న మహిళా అభ్యర్థి

కర్నూలు: పోలీసు శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ కర్నూలులో చురుగ్గా సాగుతోంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులకు స్థానిక ఏపీఎస్పీ రెండవ పటాలం పెరేడ్ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. 5వ రోజు శనివారం 739 మందికి గాను 327 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారు. 1600 మీటర్లు, 100 మీటర్ల విభాగాల్లో పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. బయోమెట్రిక్‌కు హాజరైన మహిళా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన తర్వాత పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 173 మంది అభ్యర్థులు ప్రతిభ కనపరచి తుది రాత పరీక్షకు అర్హత సాధించారు. ఏవైనా సమస్యలు, ఇతర కారణాలతో అప్పీల్ చేసుకున్న అభ్యర్థులు జనవరి 28వ తేదీన మరోసారి దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకావచ్చని అధికారులు ప్రకటించారు.

**7 నుంచి 15 వరకు సెలవులు...**

పోలీసు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా 6వ తేదీ మాత్రమే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఆదివారంతో పాటు ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి పండుగ సెలవులు ఉన్నందున దేహదారుఢ్య పరీక్షలకు విరామం ప్రకటించారు. మంత్రి టీజీ భరత్ కూతురు వివాహ రిసెప్షన్ వేడుక ఈనెల 10వ తేదీన ఏపీఎస్పీ రెండో పటాలం మైదానంలో జరగనుంది. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం పోలీసు దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్న గ్రౌండ్‌ను (మైదానం) కూడా వినియోగిస్తున్నారు. దీంతో పరుగుపందెం, లాంగ్‌జంప్ ట్రాక్‌లను మొత్తం చెరిపేస్తున్నారు. రిసెప్షన్ వేడుకకు భారీగా జనం తరలివస్తున్నందున మైదానాన్ని ఖాళీ చేయించి వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నట్లు సమాచారం.

# మోసం.. రూ. 21లక్షలు మాయం!

- ఒక నిందితుడు అరెస్టు, పరారీలో నలుగురు



నిందితున్ని చూపుతున్న సీఐ బీఏ మంజునాథ్

పెద్దకడుబూరు: డబ్బులు రెట్టింపు చేస్తామని చెప్పి రూ. 21లక్షలు మాయం చేసిన ఘటన హెచ్.మురవణి గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ బీఏ మంజునాథ్, ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పీబీ వెంకటేష్ ఫోన్‌లోని వాట్సాప్ మెసేజ్ ద్వారా తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా శాశంపల్లి గ్రామానికి చెందిన సంధుల రవి(35)తో పరిచయం ఏర్పడింది. డబ్బులు రెట్టింపు చేస్తామని వీడియోలు పంపడంతో నమ్మి వెంకటేష్ హైదరాబాద్‌కు వెళ్లి పరిశీలించాడు. తన దగ్గర డబ్బులు ఉన్నాయని, వాటిని రెట్టింపు చేయాలని కోరడంతో రవితో పాటు మరో నలుగురు(మొత్తం ఐదుగురు) డిసెంబర్ నెలలో హెచ్.మురవణి గ్రామానికి వచ్చారు. పూజాసామగ్రి, డబ్బులు ఉన్న పెట్టెలను స్వామీజీలకు అప్పగించగా మాయమాటలు చెప్పి, ఇంటి వారిని బయటకు పంపి పూజలు చేశారు. పెట్టెలను తెరవకుండా వాటితోపాటు అందరూ మంత్రాలయం వెళ్లి అక్కడ తుంగభద్రలో స్నానం చేసి.. మూడు రోజుల తరువాత పూజచేసి తెరవాలని సూచించారు. అనంతరం వారు అక్కడి నుంచి తమ ఊర్లకు వెళ్లిపోయారు. మూడు రోజుల తరువాత పెట్టెలు తెరవగా అందులో ఉంచిన రూ. 21లక్షలు మాయం కావడంతో పోలీస్‌లను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం కంబలదిన్ని గ్రామం వద్ద ఉన్న రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇంకా పరారీలో ఉన్న నలుగురిని కూడా త్వరలోనే పట్టుకొని డబ్బులు రికవరీ చేస్తామని సీఐ, ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా గతంలో గ్రామంలో ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో పీబీ వెంకటేష్ నిందితుడిగా ఉన్నారు.

# అట్టహాసంగా స్వర్ణోత్సవ సంబరం

- ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 50 వసంతాల వేడుక
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పూర్వ విద్యార్థులు
- నాటి అనుభూతులను గుర్తుచేసుకున్న వైనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చిత్రంలో రిటైర్డ్ కలెక్టర్లు రాంపుల్లారెడ్డి, జగన్నాథరెడ్డి, డాక్టర్ శంకర్‌శర్మ తదితరులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ స్వర్ణోత్సవ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 1974లో మొదలైన ఈ కాలేజీలో విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాల్లో స్థిరపడ్డారు. వారిలో పలువురు స్వర్ణోత్సవ కార్యక్రమానికి హాజరు కావడంతో కాలేజీలో పండుగ వాతావరణం నెలకొంది. రెండురోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ నాటి తరగతి గది స్మృతులను గుర్తు చేసుకున్నారు. కాలేజీ తొలి బ్యాచ్ విద్యార్థులు నాటి అనుభవాలను వేదిక మీద నుంచి పంచుకున్నారు. వెలుగోడు మండలం అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఐఏఎస్ రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ 'ఇంటర్ కాలేజీ ప్రారంభమైన తొలిరోజు తొలి విద్యార్థిగా చేరా. నాడు ఉన్నత స్థాయికి చేరుకుంటానని ఊహించలేదు. ఇక్కడి గురువులు చేసిన విద్యాబోధన, నేర్పిన క్రమశిక్షణతో ఐఏఎస్ ఆఫీసర్ స్థాయికి ఎదిగా'నని చెప్పారు. తన ఉన్నతికి దోహద పడిన ఈ కాలేజీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సహించేందుకు రూ.2 లక్షలు విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మరో రిటైర్డ్ ఐఏఎస్,వేల్పనూరుకు చెందిన జగన్నాథం మాట్లాడుతూ 'ఆత్మకూరులో 1974లో ఇంటర్ కాలేజీ ప్రారంభంకాక పోయి ఉంటే నేను ఏదో ఐటీఐ, పాలిటెక్నిక్ కోర్సు చేసి ఫిట్టర్‌గానో మెకానిక్‌గాను ఉండేవాడిని. కాలేజీలో సీటు రావడంతో పట్టుదలతో బాగా చదువుకున్నా. ఈ కాలేజీ స్నేహితుడు రాంపుల్లారెడ్డి, మరికొందరు సహకారంతో ఐఏఎస్ సాధించా'నని చెప్పారు. విద్యాబుద్ధులు నేర్పిన కాలేజీ స్వర్ణోత్సవంలో నేడు పాల్గొనడం తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందన్నారు.ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ తమది కరివేన గ్రామమని తొలిసారిగా ఆత్మకూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తున్నారని తెలిసి సంబరపడ్డానన్నారు. నేడు డాక్టర్‌గా రాణించగలుగుతున్నానంటే నాడు అధ్యాపకులు నేర్పిన విద్యాబుద్ధులే కారణమని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి విద్యార్థి లక్ష్యం పెట్టుకొని చదవాలన్నారు. ప్రభుత్వ కాలేజీలో చదివిన విద్యార్థు లు కలెక్టర్లు, డాక్టర్లు, న్యాయవాదులు ఇలా వివిధ స్థానాల్లో ఉన్నారంటే ఎంతో సంతోషంగా ఉందని అప్పట్లో బాటనీ అధ్యాపకుడిగా పనిచేసిన సీఎస్ కుమార్ పేర్కొన్నారు. అంతకు ముందు స్వర్ణోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మా ట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అవసరమైన సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు గోదాదేవి కల్యాణ నృత్యాలతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. తొలి బ్యాచ్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రఘురామ ఆచార్యులు, అధ్యాపకులు శాలువ, పూలమాలలతో సన్మానించారు.



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

# డిక్కీ బోల్టు కోసి..

- 30 బ్యాగులను ఎత్తుకెళ్లిన దుండగులు
- ఆవేదనతో వెనుదిరిగిన భక్తులు



బ్యాగులను ఎత్తుకెళ్లడంతో ఖాళీగా ఉన్న డిక్కీ

మహానంది: తమిళనాడు రాష్ట్రంలోని తిరుత్తణి నుంచి మహానందీశ్వరుడి దర్శనార్థం సుమారు 30 మంది భక్తులు కర్ణాటకకు చెందిన ఓ ట్రావెల్ బస్సు లో శనివారం తెల్లవారుజామున మహానందికి వచ్చారు. కొద్దిసేపు ఆ బస్సులోనే నిద్రించి ఆరు గంటల సమయంలో డిక్కీ ఓపెన్ చేశారు. ఏ ఒక్క లగేజీ బ్యాగు కనిపించకపోవడంతో ఖంగు తిన్నారు. డిక్కీకి ఉన్న బోల్టును కోసి తీసుకెళ్లినట్లు గుర్తించారు. తర్వాత తమ 30 బ్యాగులు కనిపించడం లేదని భక్తులు మహానంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు సిబ్బంది ద్వారా చుట్టుపక్కల వెతికించారు. ఎలాంటి ఆనవాళ్లు లేకపోవడంతో భక్తులు నిరాశతో వెనుతిరిగారు. కాగా శుక్రవారం రాత్రి భక్తులు తిరుపతి సమీపంలో భోజనాలు చేసి సుమారు గంటన్నర వరకు హైవేలో బస్సు ఆపి విశ్రాంతి తీసుకున్నారు. అక్కడే చోరీ జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

### ఇస్రో ట్రైనింగ్ నోడల్ ఆఫీస్‌గా క్లస్టర్ యూనివర్సిటీ

కర్నూలు సిటీ: ఇస్రో(స్టార్ట్) స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవగాహన, శిక్షణ ఆన్‌లైన్ కోర్సులకు క్లస్టర్ యూనివర్సిటీని నోడల్ ఆఫీస్‌గా గుర్తించారని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యూజీ, పీజీ విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి అవకాశం వర్సిటీకి రావడం సంతోషకరమన్నారు. ఈనెల 9నుంచి నెలాఖరు వరకు శిక్షణ ఉంటుందన్నారు. నోడల్ సెంటర్ కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం. పద్మావతి, నిర్వహణ సభ్యులుగా మహబూబ్ బాషా, డాక్టర్ లక్ష్మణ్ గుప్తా వ్యవహరిస్తారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

### వేధింపుల కేసులో ముగ్గురి అరెస్ట్

కర్నూలు (సెంట్రల్): అదనపు కట్నం కోసం వేధించిన ముగ్గురిని త్రీటౌన్ పోలీసులు శనివారం కడపలో అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలు.. కర్నూలుకు చెందిన షేక్ మన్జూర్ అహ్మద్ కూతురు షేక్ సుమయాను షేక్ కరీముల్లా బాషా, షేక్ నసీంభాను దంపతుల కుమారుడు షేక్ అరాఫత్‌కు ఇచ్చి వివాహం చేశారు. షేక్ సుమయాను అత్తారింటిలో అదనపు కట్నం కోసం వేధించారు. దీనిపై షేక్ సుమయా తండ్రి షేక్ మన్జూర్ అహ్మద్ మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కూతురి భర్త, అత్తమామలపై గత డిసెంబర్ 11న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం నిందితులను కడపలో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసుపై పూర్తిస్థాయి విచారణ కొనసాగిస్తున్నట్లు మూడో పట్టణ పోలీసులు పేర్కొన్నారు.